క్లుప్తంగా

చెకుముకి సైన్స్ సంబరాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, నేతలు

పామూరు: జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా 8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించే సైన్సు ప్రతిభ పరీక్షను విజయవంతం చేయాలని ఎంఈఓ పి.కోటిరెడ్డి, జేవీవీ మండల అధ్యక్షుడు సురేంద్ర పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సైన్సు సంబరాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జేవీవీ మండల ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు శంకర్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, బసవయ్య పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి



హాస్టల్‌లో ఊడిపోయిన కిటికీలను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

పామూరు: ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పాలకులు, అధికారులు త్వరితగతిన పరిష్కరించి విద్యార్థుల కష్టాలు తీర్చాలని సీపీఎం జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్ అన్నారు. స్థానిక బీసీ, ఎస్సీ హాస్టళ్లను స్థానిక నాయకులు, విద్యార్థి సంఘ నాయకులతో కలిసి పరిశీలించారు. హాస్టల్స్‌లో బాత్‌రూమ్స్‌కు డోర్లు లేవని, కిటికీలకు రెక్కలు విరిగిపోయి ఉన్నాయన్నారు. వసతులు సరిగా లేవన్నారు. కొమ్మలపాటి మాల్యాద్రి, కాశీశంకర్, షేక్.ఖాదర్‌బాషా పలువురు పాల్గొన్నారు.

భూముల పరిశీలన



పెద్ద యిర్లపాడులో భూములు పరిశీలిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

పీసీపల్లి: మండల పరిధిలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ఖాళీ భూములను ఆర్డీఓ కేశవర్ధన్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పెదయిర్లపాడు, లక్ష్మక్కపల్లి, చింతగుంపల్లి, గుంటుపల్లి గ్రామాల్లో ఖాళీ భూములను పరిశీలించి స్థానిక తహసీల్దార్ ఉషాను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో ఖాళీ భూముల్లో ఎవరన్నా సాగు చేస్తున్నారా, పోరంబోకు, గ్రేజింగ్, పశువుల పోరంబోకు వివరాలను వివరించారు.

కేరీర్ గైడెన్స్ ద్వారా ఉజ్వల భవిష్యత్

కనిగిరిరూరల్: కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు సద్వినియోగం చేసుకొని ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సర్వశిక్షా అభియాన్ జీసీడీఓ కె.హేమలత అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలను జీడీసీఓ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జీడీసీఓ హేమలత మాట్లాడుతూ ప్రభుత్వం ఒకేషనల్ విద్య కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కనిగిరి బాలికోన్నత పాఠశాలకు రూ.10 లక్షలతో సరఫరా చేసిన కోర్సు సామగ్రిని ఆమె పరిశీలించారు. మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. మెనూ, భోజన వసతి సదుపాయం, మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యం పరిశీలించారు. ఎంఈఓలు రాజాల కొండారెడ్డి, యువీ నారాయణరెడ్డి, హెచ్‌ఎం కలువ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ పద్మావతి, ఎస్ఎంసీ చైర్మన్ పందిటి మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌలు రైతులకూ అన్నదాత సుఖీభవ అమలు చేయాలి

జరుగుమల్లి(సింగరాయకొండ): కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ కౌలు రైతు సంఘ నాయకులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీ ప్రసన్నేశ్వరికి వినతిపత్రం అందజేశారు.

పేదల వైద్య విద్యపై చంద్రబాబు కుట్ర

- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి
- రూ.కోట్లు దండుకునేందుకే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ- మాజీ ఎమ్మెల్యే ఆదెన్న
- రాష్ట్రంలో చంద్రబాబు దుర్మార్గపు పాలన- దద్దాల ధ్వజం



మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, పక్కన దద్దాల నారాయణ, ఇతర నేతలు



సంతకాల సేకరణ ప్రారంభిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, దద్దాల నారాయణ యాదవ్, కసుకుర్తి ఆదెన్న, నేతలు

కనిగిరిరూరల్:

పేదల వైద్య విద్యపై చంద్రబాబు ప్రభుత్వం కుట్ర పన్నిందని, పీపీపీ విధానంలో రూ.కోట్లు దండుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అధ్యతన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నత లక్ష్యంతో 17 కాలేజీలను ప్రారంభించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2019 వరకు కేవలం 12 కాలేజీలు మాత్రమే ఉన్నాయని వివరించారు. ఆ 12 కాలేజీల్లో కేవలం 2,360 మాత్రమే వైద్య విద్యార్థులు చదువుకునే అవకాశం ఉందన్నారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా విపత్తు తర్వాత.. ప్రతి గ్రామానికి ఎంబీబీఎస్) వైద్యునితో మెరుగైన వైద్యం అందించాలనే ఉన్నత సంకల్పంతో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను తీసుకుని వచ్చారన్నారు. ఇందులో ఆర్థికంగా వెనుకబడిన వారంతా చదువుకునే పరిస్థితిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. దీన్ని కూటమి ప్రభుత్వ నేతలు రియల్ వ్యాపారంగా మార్చి పీపీపీ విధానంతో ప్రైవేట్‌పరం చేసి కోట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. కూటమి ప్రభుత్వ నేతలు, పాలకులు నిస్సిగ్గుగా మెడికల్ కాలేజీలపై దుర్మార్గంగా విషపు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు పాలనలో వైద్య రంగ పథకాలు పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణను చేపట్టామన్నారు.



పాల్గొన్న పార్టీ శ్రేణులు

చంద్రబాబు దుష్ట కుట్రపై ప్రజా ఉద్యమం

పార్టీ కనిగిరి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టి పేద వర్గాల, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల పిల్లలకు వైద్య విద్యను దూరం చేసేందుకు చంద్రబాబు చేస్తున్న దుష్ట కుట్రపై ప్రజలతో కలిసి ఉద్యమం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా ఆరోగ్య రంగాన్ని ప్రైవేట్‌పరం చేస్తోందని తీవ్రంగా మండిపడ్డారు. చంద్రబాబు చేస్తున్న కుట్ర రాజకీయాలను రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు దుర్మార్గాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే కోటి సంతకాల సేకరణలో పార్టీ శ్రేణులు ప్రతి గ్రామంలో ఉత్సాహంగా, బాధ్యతగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో చంద్రబాబు అరాచక పాలన

మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పరిశీలకుడు కసుకుర్తి ఆదెన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో దర్మార్గపు పాలన సాగిస్తోందని మండిపడ్డారు. మెడికల్ కాలేజీను తన సొంత మనుషులకు అప్పగించేందుకే చంద్రబాబు పీపీపీ విధానం అమలుకు తెస్తున్నారని ఘాటుగా విమర్శించారు. ఇదే కొనసాగితే భవిష్యత్‌లో పేద విద్యార్థులు వైద్య విద్యను చదివే పరిస్థితి ఉండదన్నారు. పేదలకు ప్రభుత్వ వైద్యం కనుమరుగు అవుతుందని వివరించారు. కూటమి నేతల తీరును ఎండగడుతూ పార్టీ శ్రేణులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, మాజీ ఏఎంసీ చైర్మన్ సీహెచ్ సాల్మన్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీలు గాయం సావిత్రి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, వైస్ చైర్మన్ పులి శాంతి, పార్టీ రాష్ట్ర, జిల్లా వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల కృష్ణారెడ్డి, డాక్టర్ ఎస్కే రసూల్, యక్కంటి శ్రీను, కటికల వెంకటరత్నం, జి.ఆదినారాయణరెడ్డి, ఓమెగా రామిరెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా చేసే ప్రజా ఉద్యమాన్ని ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. కూటమి సర్కార్ దుష్ట పాలనను రాష్ట్ర ప్రజలకు గమనిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, ఎస్ మోహన్‌రెడ్డి, ఎస్కే ఖాజా, శ్యామల సాంబిరెడ్డి, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు గాయం బలరామిరెడ్డి, భువనగిరి వెంకటయ్య, గయాజ్, మితికల గురవయ్య, టి.సురేష్, మహేంద్రారెడ్డి, దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఆయిమళ్ల నాగమణి, ఎస్కే రహీం, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, సిద్దారెడ్డి, గజ్జల వెంకటరెడ్డి, చాంద్‌బాషా, పల్నాటి భాస్కర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పలుకూరి భాస్కర్, గాలి నాగేశ్వరరావు, మూలే రాజశేఖరరెడ్డి, బాల మాల కొండారెడ్డి, సీహెచ్ కిశోర్, పెద్దన్న, దరిశి సుబ్రహ్మణ్యం, ఉండేల వెంగళరెడ్డి, గుంటూరు వెంకటేశ్వర్లు చౌదరి, హమీద్, ఎస్కే కరీం, జీలాని, వెంగళరావు గుప్తా, యాకోబు, భారతీ, షకీల, సుస్మిత, లక్ష్మీ, ఇండ్లా భాను, డాక్టర్ గౌస్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యువత కలాం బాటలో నడవాలి



పామూరులో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



సీఎస్‌పురంలో కలాం చిత్రపటానికి నివాళులు

పామూరు: యువత అబ్దుల్‌కలాం బాటలో నడవాలని వైఎస్సార్ సీపీ ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు కల్లూరి రామిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ షేక్.చాంద్‌బాషా, ప్రజాసంఘాల నాయకులు జొన్నలగడ్డ గోవిందయ్య అన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాం 94వ జయంతి కార్యక్రమం బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కోఆప్షన్ సభ్యులు షేక్.నాయబ్‌రసూల్, రాష్ట్ర గ్రీవెన్స్‌సెల్ కార్యదర్శి గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, మైనారిటీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్.గయాజ్, ఎస్టీసెల్ శ్రీరాం శ్రీనివాసులు, తుపాకుల ఆంజనేయులు, పాలేటి ప్రేమ్ కుమార్, యంపీటీ నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): యువత ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి బాటలో ముందుకు సాగాలని సీఎస్‌పురం ఎంపీపీఎస్ (ఎస్టీ) పాఠశాల హెచ్‌ఎం లక్కెపోగు ఆంథోని, మానవహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ షేక్ గౌస్ అన్నారు. అబ్దుల్ కలాం జయంతిని స్థానిక ఎంపీపీఎస్ పాఠశాలలో నిర్వహించారు. దేశ దశా దిశను మార్చే శక్తి ఒక్క యువతకే ఉందన్నారు.

కనిగిరిరూరల్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏపీజే కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ కలాం జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. కమిషనర్ పి. కృష్ణ మోహన్‌రెడ్డి, మేనేజర్ ప్రసాద్, టీపీఓ సువర్ణ కుమార్, హెల్త్ అసిస్టెంట్ చెన్న కేశవులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

పొన్నలూరు: ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని ఎంపీడీఓ సుజాత అన్నారు. మండలంలోని సింగరబొట్లపాలెం ప్రాథమికోన్నత పాఠశాల్లో బుధవారం విద్యార్థులతో చేతులు పరిశుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించి, దీని వలన కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి చేతులను పరిశుభ్ర పరచకుండా ఆహారాన్ని తినడం వలన నీళ్ల విరోచనాలు, పచ్చ కామెర్లు వివిధ రకాల వ్యాధులు వస్తాయన్నారు. విద్యార్థులు నిత్యం వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల అంటువ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

పొన్నలూరు: గ్రామాల్లో పారిశుద్య పనులు చేపట్టి పరిశుభ్రమైన గ్రామాల కోసం కృషి చేయాలని ఎంపీడీఓ సుజాత అన్నారు. పొన్నలూరు, సింగరబొట్లపాలెం గ్రామాల్లో బుధవారం పారిశుధ్య పనులను పరిశీలించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే సీజనల్ వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. కార్యదర్శి నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పీసీపల్లి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ కృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని పాఠశాలలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహకల్పించారు. చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కేజీబీవీ ఎస్ఓ సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు



సింగరబొట్లపాలెంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సుజాత

కొండపి: మండలంలోని ముప్పవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమన్నారు. ప్రధానోపాధ్యాయుడు కోటిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రత్నప్రభ, ఎల్వీ ప్రసాద్, గవిని శివశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక నిర్వహణ సక్రమంగా ఉండాలి



టంగుటూరు లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీఎం సుబ్బారావు

టంగుటూరు: సంఘ సభ్యుల ఆర్థిక నిర్వహణ సక్రమంగా ఉండేందుకే మన డబ్బులు..మన లెక్కలు యాప్‌ను తీసుకువచ్చినట్లు ఏపీఎం సుబ్బారావు అన్నారు. స్థానికమండల కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్‌లో సభ్యుల పొదుపు, అప్పులు చెల్లింపుల వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో సభ్యులు తెలుసుకోవచ్చన్నారు. యాప్ ప్రాముఖ్యత సంఘాల సభ్యులకు తెలియజేసేలా గ్రామ సంఘాల సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలన్నారు. వీఓఏలు అలసత్వం లేకుండా పనిచేయాలన్నారు. సంఘాల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని సూచించారు. ఎల్‌సీ సీసీ మాధవరావు, సీసీ వెంకట్రావు, శ్రీను, కోటేశ్వరి, కవిత, ద్రాక్షాయని, సీఆర్పీలు పాల్గొన్నారు.

నవంబర్ 2న కనిగిరి ఎన్జీఓ సంఘ ఎన్నికలు



ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న ఎన్నికల అధికారి

కనిగిరిరూరల్: ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గజిటెడ్ ఉద్యోగుల సంఘ ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్‌ను ఎన్నికల అధికారి కొత్తపల్లి ముంజేష్ బుధవారం రాత్రి విడుదల చేశారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 1,011 మంది సభ్యులు ఉన్నట్లు జాబితాలో తెలిపారు. ఓటర్ల జాబితాలో ఓటు లేని వారు ఎవరైనా ఉంటే నామినేషన్ తేదీ లోపు సంప్రదించి సభ్యత్వం తీసుకోవాలని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ నెల 26న నామినేషన్ దాఖలు, 27 పరిశీలన, ఉపసంహరణ, పోటీ ఉంటే నవంబర్ 2న ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు.

అధికారులపై సభ్యుల ధ్వజం

హనుమంతునిపాడు: అధికారుల తీరుపై సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ కొదమల బెంజిమెన్ మాట్లాడుతూ లింగంగుండ్ల గ్రామానికి సాగర్ జలాలు సక్రమంగా కావడం లేదని అధకారులను నిలదీశారు. విద్యుత్ అధికారులు అదనపు లోడు పేరుతో వసూలు చేస్తున్నారని పండిపడ్డారు. వేములపాడులో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గుర్రైనా పట్టించుకోలేదన్నారు. పైపులు మరమ్మతులు చేసి మండల ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలనికోరారు. దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు మార్చాలని ఎంపీటీసీ సుబ్బారెడ్డి, సర్పంచ్ తిరుపతిరెడ్డి, రామకృష్ణారెడ్డిలు ఏఈని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలకు, సమావేశాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం లేదని ఎంపీడీఓ దృష్టికి తీసుకువెళ్లారు. కనిగిరి, గుడిపాటిపల్లి, దాసరిపల్లి, కోటతిప్పలకు బస్సు సర్వీసులు మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో కూడ నడపాలని కోరారు.



విద్యుత్ సమస్యలు పట్టించుకోలేదని నిలదీస్తున్న సర్పంచ్ రామక్రిష్ణారెడ్డి

ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ ఎక్కడా..?

ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించడం లేదని ఎంపీపీ గాయం సావిత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ, గుండూరు, ఒంగోలు ఇతర ప్రాంతాల్లో నివాసం ఉండే వారికి హాజరు వేసి ఉపాధి బిల్లులు స్వాహా చేస్తున్నారన్న ఆరోపణలుఉన్నాయన్నారు. అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. తహసీల్దార్ షేక్ నాగూర్‌మీరా, ఎంపీడీఓ ఎం రంగసుబ్బరాయుడు, ఏఓ రవికుమార్, ఏఈ శ్రీకాంత్, పీఆర్ ఏఈ బ్రహ్మయ్య, వైస్ ఎంపీపీలు రుద్రపాటి శోభ, బెంజి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



జెడ్ మేకపాడులో అవగాహన కల్పిస్తున్న సత్యవతి



అక్కంపేటలో పౌష్టికాహార ఆవశ్యకతను వివరిస్తున్న సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ

పొన్నలూరు: గర్భిణులు, బాలింతలు బలమైన పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్య వంతంగా ఉండాలని అంగన్‌వాడీ కార్యకర్త వై సత్యవతి అన్నారు. మండలంలోని జెడ్ మేకపాడులో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆకుకూరలు, పండ్లు, పప్పు దినుసులు వంటి ఆహారంగా తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వలన రక్తహీనతను నివారించవచ్చన్నారు.

పామూరు: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. మండలంలోని అక్కంపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం 8వ రాష్ట్రీయ పోషన్ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పోషణ, సంరక్షణలో పురుషుల భాగస్వామ్యంపై సూపర్‌వైజర్ వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు విధిగా తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలను అంగన్‌వాడీ కార్యకర్తలు ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అప్రమత్తంచేయాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించి, అవగాహన ర్యాలీ నిర్వహించారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

సింగరాయకొండ: బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి తహసీల్దార్ రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా బాణాసంచా నిల్వ చేసిన, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. బాణసంచా విక్రయాలు చేసేవారు పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, పంచాయతీ అనుమతి పొందిన తరువాత ఆర్‌డీఓ నుంచి తాత్కాలిక లైసెన్స్ పొందవచ్చని, తాత్కాలిక లైసెన్స్ కోసం మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న బేళ్ల తిరస్కరణ



కొండపిలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

కొండపి: స్థానిక పొగాకు వేలంకేంద్రంలో బేళ్ల తిరస్కరణ ఎక్కువైంది. అసలే గిట్టుబాటు ధర లేక అల్లాడుతుంటే వేలంచివరకు దశకు వచ్చినా పొగాకు బేళ్ల తిరస్కరణ రోజు రోజుకు ఎక్కువ కావడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం నిర్వహించిన వేలంలో 442 బేళ్లు తిరస్కరణకు గుర్రైనట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని పెట్లూరు, ఎస్ ఎస్.కండ్రిక, వర్ధినేనివారిపాలెం, జగ్గరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1345 బేళ్లను తీసుకురాగా 903 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.315, కనిష్ట ధర రూ.70, సరాసరి ధర రూ.195.26గా నమోదైంది. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రానికి ఆలకూరపాడు, అనంతవరం, రావివారిపాలెం, పాలేటిపాడు, జయవరం గ్రామానికు చెందిన రైతులు 1167 బేళ్లను తీసుకురాగా 981 బేళ్లను కొనుగోలు చేసి 186 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.316, కనిష్ట ధర రూ.70, సరాసరి ధర రూ.238.33గా నమోదైంది. వేలంలో 42 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆఫీసులో ఆర్డీఓ రికార్డులు తనిఖీ

కనిగిరిరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఒంగోలు రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఒంగోలు ఆర్డీఓతో పాటు, సిబ్బంది బుధవారం తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అందిన సమాచారం మేరకు మూడు నెలలుగా కనిగిరి ప్రాంతంలోని భూముల ఖాతాలకు సంబంధించి జరిగిన మ్యుటేషన్ ఫైల్స్ రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. కనిగిరి తహసీల్దార్ సెలవులో ఉన్న సమయంలో ఒంగోలు ఆర్డీఓ, కనిగిరి ఆఫీసులోని రికార్డులను పరిశీలించడం చర్చనీయాంశంగా మారింది.



రికార్డులను పరిశీలిస్తున్న ఒంగోలు ఆర్డీఓ